## విద్యార్థినికి ఎంపీ అభినందన



శార్వాణిని అభినందిస్తున్న ఎంపీ రవిచంద్ర

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 1 (నమస్తే తెలంగాణ): రామవరం టూ ఇంక్లైన్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు తమ్మిశెట్టి అశోక్-నాగమణి దంపతుల కుమార్తె శార్వాణి, ఇంటర్ మొదటి సంవత్సరంలో 470 మార్కులకుగాను 460 మార్కులు సాధించింది. శార్వాణి, ఆమె తండ్రి అశోక్ తదితరులు ఎంపీ రవిచంద్రను ఖమ్మంలోని ఆయన స్వగృహంలో ఆదివారం కలిశారు. శార్వాణిని ఎంపీ అభినందించి, శాలువా కప్పి సత్కరించారు.

## పాఠశాలలు, వసతిగృహాలకు నిత్యావసరాల కోసం టెండర్ల ఆహ్వానం

భద్రాచలం, జూన్ 1: జిల్లా గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని పాఠశాలలు, వసతిగృహాలకు కోడిగుడ్లు, కూరగాయలు, అరటిపండ్లు, స్కిన్‌లెస్ చికెన్ 2025-26 విద్యా సంవత్సరానికి సరఫరా చేసేందుకు ఆసక్తి కలిగిన అమ్మకందారుల నుంచి సీల్డ్ టెండర్లు కోరుతున్నట్లు ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండరు ఫారం ధర రూ.2వేలు డీడీని ఉపసంచాలకులు, ఐటీడీఏ గిరిజన సంక్షేమశాఖ, భద్రాచలం పేరుతో ఎస్‌బీఐ భద్రాచలంలో చెల్లుబాటు అయ్యేలా సమర్పించాలన్నారు. ఈ నెల 2నుంచి 9వ తేదీవరకు ఉపసంచాలకులు నుంచి టెండరు ఫారం పొందవచ్చన్నారు. ధరావత్ సొమ్ము కూరగాయలు రూ.50వేలు, పండ్లు రూ.50వేలు, గుడ్లు రూ.50వేలు, స్కిన్‌లెస్ చికెన్ రూ.50వేలు డీడీ తీసి అందజేయాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ సరఫరాదారులకు 20శాతం డిపాజిట్‌లో రాయితీ ఉంటుందని, 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తమ ఫారాలు టెండరు బాక్సులో వేయాలన్నారు. ఈనెల 10న ఉదయం 11 గంటలకు సీల్డ్ టెండరు తెరిచి పీవో నిర్ణయం మేరకు తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## నవోదయ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



బ్రిలియంట్ నవోదయ కోచింగ్ డైరెక్టర్ బీఎన్‌ఆర్

బూర్గంపహాడ్, జూన్ 1: 2026-2027 విద్యాసంవత్సరానికి గాను నవోదయ లో 6వ తరగతి చేరేందుకు ప్రవేశ పరీక్ష కోసం జూలై 29వ తేదీవరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని సారపాక బ్రిలియంట్ నవోదయ కోచింగ్ డైరెక్టర్ బీఎన్‌ఆర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయ ప్రవేశ పరీక్ష డిసెంబర్ 13వ తేదీన జరుగుతుందని జవహర్ నవోదయ విద్యాలయ సమితి ప్రకటన చేసిందని తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఇంగ్లిష్, తెలుగుమీడియం విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీఎన్‌ఆర్ తెలిపారు. పూర్తి వివరాలకు 9866283566ను సంప్రదించాలని బీఎన్‌ఆర్ కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



కొత్తగూడెం గణేష్ టెంపుల్: ప్రచారం చేస్తున్న టీచర్లు

కొత్తగూడెం గణేష్ టెంపుల్/ములకలపల్లి, జూన్ 1: నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంపు కోసం టీఎస్ యూటీఎఫ్ చేపట్టిన ప్రచార జాతా ఆదివారం కొత్తగూడెం పట్టణంలో, ములకలపల్లి మండలంలో పర్యటించింది. కొత్తగూడెంలోని రైల్వే స్టేషన్, బస్టాండ్, పోస్టాఫీస్ సెంటర్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో, ములకలపల్లి మండలంలోని ములకలపల్లి, జగన్నాథపురం, మాదారం, పూసుగూడెం, సీతారాంపురం, కొత్త గంగారం, పాతగంగారం, పాతూరు, సుబ్బనపల్లి తదితర గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేసింది. ప్రజలను ఉద్దేశించి రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, బి.లక్ష్మా, మంగీలాల్, వి.వరలక్ష్మి, ఎం.రాజేశ్వరరావు, గరికె శ్రీనివాస్, ఎం.కిషోర్, శ్రీరాం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సర్జన్ జ్యోతిర్మయికి అదనపు బాధ్యతలు



జ్యోతిర్మయిని సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు, ఆస్పత్రి సిబ్బంది

మణుగూరు టౌన్, జూన్ 1: మణుగూరు సింగరేణి ఏరియా ఆస్పత్రిలో సీనియర్ సర్జన్‌గా ఉన్న జ్యోతిర్మయికి ఆస్పత్రి ఏవోగా అదనపు బాధ్యతలు ఇస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆదివారం డాక్టర్ జ్యోతిర్మయికి మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు, టీబీజీకేఎస్ నాయకులు, సిబ్బంది శాలువ కప్పి సన్మానించారు. సీఎండీ బలరాం, జీఎం రాంచందర్, సీఎంవో కిరణ్‌రాజుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఇజ్రాయిల్, బంగారి పవన్ కుమార్, మునిగేల నాగేశ్వరరావు, ముకేష్ కుమార్, రాజ్ కుమార్, పద్దం శ్రీనివాస్, రమేశ్‌బాబు, పిట్ సెక్రటరీలు వినయ్‌కుమార్, నరేష్, రేవన్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# మేలో 2.71 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న ఏరియా జీఎం కృష్ణయ్య

ఇల్లెందు రూరల్, జూన్ 1: మే నెలలో సాధించిన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలను ఇల్లెందు ఏరియా జీఎం కృష్ణయ్య వెల్లడించారు. ఆదివారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మే, 2025 నెలకు సంబంధించి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి 3.10 లక్షల టన్నులకు గాను 2.71 లక్షల టన్నులు ఉత్పత్తి చేశామన్నారు. 87 శాతం ఉత్పత్తి చేశామన్నారు. 1.57 లక్షల టన్నుల బొగ్గును రైల్వే మార్గం ద్వారా, 0.42 లక్షల టన్నులను రోడ్డు మార్గం ద్వారా, 0.54 లక్షల టన్నులను ఆర్‌సీహెచ్‌పీ ద్వారా బట్వాడా చేయడం జరిగిందన్నారు. మే నెలలో 41 రేకుల బొగ్గును ఉత్పత్తి చేసి రవాణా చేశామన్నారు. ఇల్లెందు ఏరియాకు కేటాయించిన వార్షిక బొగ్గు లక్ష్యం 6.20 లక్షల టన్నులకు గాను 5.27 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. రక్షణతో కూడిన బొగ్గును ఉత్పత్తి చేసిన అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.

**ఏరియా ఉత్తమ ఉద్యోగులు వీరే**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇల్లెందు ఏరియా ఉత్తమ ఉద్యోగులను ఆదివారం జీఎం కార్యాలయంలో ఇల్లెందు ఏరియా జీఎం కృష్ణయ్య ప్రకటించారు. కేవోసీ నుంచి ఉండం బ్రహ్మం (అడిషనల్ మేనేజర్)ఏరియా ఉత్తమ అధికారిగా ఎంపిక చేశామన్నారు. ఈయనను కొత్తగూడెం ప్రకాశం స్టేడియం సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో సన్మానిస్తారని పేర్కొన్నారు. జేకే5 ఓసీ నుంచి షేక్ అలియాజ్గర్ (హెడ్‌ఓవర్ మెన్)ను ఉత్తమ ఉద్యోగిగా ఎంపిక చేశామని, జేకే కాలనీలోని బ్లాక్ డైమండ్ స్టేడియంలో సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులతో హాజరుకావాలని కోరారు.

# రామాలయంలో అన్యమత ప్రచారం

- పరమత ప్రచార కవర్లలో స్వామివారి వస్త్రాల పంపిణీ
- దేవస్థానం కార్యనిర్వహణాధికారికి భక్తుడి ఫిర్యాదు




స్వామివారి వస్త్రాలు పెట్టి ఇచ్చిన అన్యమత ప్రచార కవర్

భద్రాచలం, జూన్ 1: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో అన్యమత ప్రచారం జరుగుతోందంటూ దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో)కు ఆదివారం ఓ భక్తుడు ఫిర్యాదు చేసిన చర్చనీయాంశమైంది. ఆ ఫిర్యాదులోని కథనం ప్రకారం.. ఏపీలోని గుంటూరుకు చెందిన భక్తుడు మేళ్లచెరువు జనార్దనరావు భద్రాద్రి రామాలయంలో ఆదివారం స్వామివారి దర్శనానికి వచ్చాడు. దర్శనానంతరం ఎంతో పవిత్రంగా భావించే స్వామివారి శేషవస్త్రాలను కొనుగోలు చేశాడు. అయితే ఆ వస్త్రాలను సదరు కౌంటర్‌లో ఉన్న సిబ్బంది అన్యమత ప్రచారానికి తావిచ్చేలా ఉన్న ఓ కవర్‌లో పెట్టి ఆ భక్తుడికి అందజేశారు. అయితే, ఆ భక్తుడు కవర్‌పై ఉన్న 'జీసెస్ క్రిస్ట్ ఈజ్ లార్డ్ ఆఫ్ ఆల్' వాక్యాన్ని గమనించి ఒక్కసారిగా ఆగ్రహానికి గురయ్యాడు. ఎంతో పవిత్రమైన స్వామివారి శేషవస్త్రాలను తాము కొనుగోలు చేస్తుంటే ఇలా అన్యమత ప్రచారం పేరుతో ఉన్న కవర్లలో పెట్టి ఇచ్చి తమతోపాటు తమలాంటి భక్తుల మనోభావాలు దెబ్బతీస్తారా అంటూ మండిపడ్డారు. ఈ ఘటన చాలా దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ రకమైన అన్యమత ప్రచారం దేవస్థానంలో జరగనీయకుండా తగిన చర్యలు తీసుకోవాలని దేవస్థానం ఈవోకు ఆ భక్తుడు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా అన్యమత ప్రచారం దావానంలా వ్యాపించినప్పటికీ దేవస్థానం అధికారులు మాత్రం గుర్తించకపోవడం పట్ల రామభక్తులు మండిపడుతున్నారు. కాగా అన్యమత ప్రచారానికి కారణమైన సదరు లైసెన్స్‌దారుకి దేవస్థాన అధికారులు నోటీసులు జారీ చేశారు.

## డీసీవోకు సన్మానం



మహ్మద్ కుర్షిద్ దంపతులను సన్మానిస్తున్న సొసైటీ చైర్మన్, పాలకవర్గ సభ్యులు

మణుగూరు టౌన్, జూన్ 1: జిల్లా సహకార అధికారిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన మహ్మద్ కుర్షిద్ దంపతులను మణుగూరు సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మణుగూరు సొసైటీ అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, ముఖ్య కార్యదర్శి జ్ఞానదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## 8న ఉద్యమకార్యాచరణ సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కరకగూడెం, జూన్ 1: ఈనెల 8వ తేదీ ఉదయం 11 గంటలకు ఖమ్మం నగరంలోని ఐఎంఏ హాల్‌లో గిరిజన హక్కుల సాధన కోసం రాష్ట్రస్థాయి ఉద్యమ కార్యాచరణ సభ నిర్వహించనున్నట్లు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేశ్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను నాయక్, కృష్ణానాయక్ తెలిపారు. మండలంలోని కలవల నాగారంలో ఆదివారం సభకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీమారం మండలం బూరుగుపల్లి గ్రామంలో భూక్యా రాజ్‌కుమార్ నాయక్‌పై ఎస్సై శ్వేత కులం పేరుతో దూషించారని ఆమెపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా రాందాస్ నాయక్, మంతు, మోతీలాల్, శ్యాం, దశరథ్ నాయక్, భూక్యా శ్రీను, బానోత్ నందు నాయక్ పాల్గొన్నారు.

# తహసీల్ ప్రాంగణంలో ఇసుక, మట్టి



కార్యాలయ ఆవరణలో మట్టిదిబ్బలు, ఇసుక నిల్వలు

పాల్వంచ రూరల్, జూన్ 1: పాల్వంచ తహసీ కార్యాలయ ఆవరణను ఇసుక, మట్టి నిల్వలు ఆక్రమించాయి. వివిధ అవసరాల కోసం ఇక్కడకు వస్తున్న ప్రజలపాలిట ఇవి అసౌకర్యంగా మారాయి. ఇసుక, మట్టి అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను రెవెన్యూ అధికారులు పట్టుకుని ఈ కార్యాలయానికి తరలిస్తున్నారు. ఆ ఇసుకను, మట్టిని కార్యాలయ ఆవరణలో మూడు నెలల నుంచి డంపింగ్ చేయిస్తున్నారు. ఇవి ఇప్పుడు గుట్టలు గుట్టలుగా పేరుకుపోయి.. ఆవరణలోని అధిగ భాగాన్ని ఆక్రమించాయి. నిత్యం వందల సంఖ్యలో వచ్చే ప్రజలపాలిట ఇవి అసౌకర్యంగా మారాయి. గతంలో ఈ ఆవరణ విశాలంగా ఉండటంతో ప్రహరీ చుట్టూ ఉన్న చెట్ల కింద వాహనాలను పార్కింగ్ చేస్తుండేవారు. ఇప్పుడు ఈ ఆవరణలో కొంత ప్రదేశాన్ని ఇందిరమ్మ మోడల్ ఇల్లు, మిగిలిన ప్రదేశాన్ని ఇసుక-మట్టి నిల్వలు ఆక్రమించాయి. ఇక్కడ స్థల లేకపోవడంతో ప్రజలు తమ వాహనాలను రోడ్డు పైనే పెడుతున్నారు. పెద్ద వాహనాలేవీ కార్యాలయంలోకి వచ్చే పరిస్థితి లేదు. దీనిపై తహసీల్దార్ దారా ప్రసాద్‌ను 'నమస్తే' సంప్రదించింది. ''ఇసుక, మట్టి నిల్వలను త్వరలో వేలం వేసి తొలగిస్తాం'' అని చెప్పారు. ఆ వేలం వేసేది ఎప్పుడో, ప్రజల వెతలు తీరేదెప్పుడో..ననేవి, ప్రస్తుతానికి సమాధానం లేని ప్రశ్నలు.

# ఇసుక ర్యాంపులో అక్రమ వసూళ్లు..

**డబ్బులు ఇవ్వని వారికి నో ఇసుక...**

**రోజుల తరబడి నిరీక్షిస్తున్న లారీ డ్రైవర్లు**



ఆందోళన చేస్తున్న లారీ డ్రైవర్లు

మణుగూరు టౌన్, జూన్ 1: లారీకో రేటు చొప్పున అక్రమ వసూళ్లకు పాల్పడటం... అధికంగా ఎవరు డబ్బులు ఇస్తే వారికే లోడ్ చేయడం... ఇవ్వని వారిని రోజుల తరబడి నిరీక్షింపజేయడంతో లారీ డ్రైవర్లు విసుగు చెందుతున్నారు. దీంతో ఆదివారం లారీ డ్రైవర్లు నిరసన తెలిపారు. మణుగూరు సొసైటీ ఇసుక ర్యాంపులో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, ఇసుక ర్యాంపులో వెళ్లే లారీల వద్ద నుంచి అదనంగా రూ.500 నుంచి రూ.2500 వరకు వసూలు చేస్తున్నారని డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఇవ్వకుంటే ఇసుక లారీల లోడింగ్ చేయడం లేదని, దీంతో రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా రోడ్లపై లారీలను నిలిపివేయడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ వసూళ్లను నిలిపివేయాలని కోరుతున్నారు.

## జాతీయ 'రహదారి'పై సంత

**ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు**



రోడ్డుపైనే వ్యాపారం చేస్తున్న వ్యాపారులు

బూర్గంపహాడ్, జూన్ 1: ప్రతి ఆదివారం మండలంలోని సారపాకలో జరిగే సంత వాహనదారులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. వ్యాపారులు జాతీయ రహదారి పక్కనే వ్యాపారం సాగిస్తుండటంతో కూరగాయలు, నిత్యావసరాలు కొనుగోలు చేసేందుకు వచ్చిన వినియోగదారులు అక్కడ గుమికూడటంతో రోడ్డుపైకి సంత జరుగుతోంది. ఇదే ప్రాంతంలో ఇటీవల కాలంలో చాలా ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఓ ప్రమాదంలో ఒకరు ప్రాణాలు సైతం కోల్పోయారు. నిబంధనలు పాటించకుండా సంత వ్యాపారం చేస్తున్న వారికి పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చినా ఇక్కడ వ్యాపారం మాత్రం నిబంధనలకు అనుగుణంగా సాగడంలేదు. సంత నిర్వాహకులు పంచాయతీ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేయడం పట్ల వాహనదారులు మండిపడుతున్నారు. సంత నిర్వాహకులపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు రోడ్డుపైకి సంత వ్యాపారం రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




మాట్లాడుతున్న ఆర్ మధుసూదన్‌రెడ్డి

ఇల్లెందు, జూన్ 1: కాంగ్రెస్ ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ కార్మికుల సమస్యలపై లేదని టీయూసీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు ఆర్ మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎల్లన్న భవనంలో జరిగిన ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టీయూసీఐ, ఆఫీస్ బేరర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సింగరేణి అటు ప్రభుత్వ రంగ సంస్థల లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల జీతాల పెంపుదలపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాల పెంపుదలపై నిర్ణయం తీసుకోకపోతే కార్మికులు ఉద్యమాలకు సిద్ధమవుతారని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రమేశ్, వై.గోపాలరావు, పీ.సతీశ్, పాయం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న కిషన్‌నాయక్

ఇల్లెందు, జూన్ 1: మద్యం సిండికేట్ వ్యవస్థకు సహకరిస్తున్న ఇల్లెందు ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సేవాలాల్ టేకులపల్లి మండల అధ్యక్షుడు బానోత్ కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం టేకులపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్సైజ్ అధికారులకు సిండికేట్ వ్యవస్థపై ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. మద్యం దందాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సేవాలాల్ సేన నాయకులు బీ.నగేశ్, నాగరాజు, బోడ శేఖర్, సుమన్ పాల్గొన్నారు.

## నేడు బీఆర్‌ఎస్ జెండావిష్కరణ

ఇల్లెందు, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర అవిర్భవ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని జగదాంబ సెంటర్‌లో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సోమవారం ఉదయం 8.30గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం బీఆర్‌ఎస్ జెండావిష్కరణ ఉంటుందని బీఆర్‌ఎస్ నాయకుడు దిండిగల రాజేందర్ తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు,కార్యకర్తలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

## నేడు గిరిజన దర్బార్

భద్రాచలం, జూన్ 1: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన దర్బార్ నిర్వహిస్తామని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు. గిరిజనులు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు అందించాలని తెలిపారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం



స్వామికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, జూన్ 1: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం అంతరాలయంలో మూలవరులకు 108 స్వర్ణ పుష్పాలతో అర్చకులు అర్చన జరిపారు. అంతరాలయంలోని ధృవమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం, నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను ప్రాకార మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

**రామాలయానికి పోటెత్తిన భక్తులు...**

శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. ఆదివారం సెలవుదినం కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు.

## నేడు పెసర, వరి విత్తనాలు అందజేత

చుంచుపల్లి, జూన్ 1: జిల్లాలోని అన్ని మండలాల్లో రైతులకు వరి, పెసర విత్తనాలను సోమవారం అందించనున్నట్లు కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా జూన్ 2న ప్రతి రెవెన్యూ గ్రామంలో ముగ్గురు రైతులను ఎంచుకుని ఈ విత్తనాలను ఇస్తారని పేర్కొన్నారు.

## రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జూన్ 1: ఇంటర్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలను ఈ నెల 3నుంచి కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఉంటాయి. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.00నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు నాలుగు రోజులపాటు ఈ పరీక్షలు జరుగుతాయని వివరించారు.

## క్షతగాత్రురాలు మృతి

దమ్మపేట రూరల్, జూన్ 1: రోడ్డు ప్రమాద క్షతగాత్రురాలు ఆస్పత్రిలో మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. వేంసూరు మండలం అడవి రామన్నపాలెం గ్రామానికి చెందిన ఈలప్రోలు గణపతి-ప్రభావతి(42) దంపతులు శనివారం మండలంలోని నాయుడుపేటలో బంధువుల ఇంట శుభకార్యానికి ద్విచక్ర వాహనంపై వచ్చారు. అది పూర్తయిన తర్వాత స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. గున్నేపల్లి శివారులో జాతీయ రహదారిపై వీరి వాహనాన్ని వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. గణపతి, ప్రభావతి తీవ్రంగా గాయపడ్డారు. ముందుగా సత్తుపల్లి ఆస్పత్రిలో, ఆ తర్వాత ఖమ్మం ఆస్పత్రిలో కుటుంబీకులు చేర్పించారు. ప్రభావతి శనివారం అర్ధరాత్రి ఆస్పత్రిలోనే మృతి చెందింది. ఆమె భర్త గణపతి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## కాలువలో మృతదేహం లభ్యం

పర్ణశాల, జూన్ 1: దుమ్ముగూడెం మండలంలోని ఆంధ్రకేసరి నగర్‌లో గల పెట్రోల్ బంక్ వద్ద కాలువలో ఆదివారం మధ్యాహ్నం కొందరు స్థానికులకు గుర్తు తెలియని మృతదేహం కనిపించడంతో దుమ్ముగూడెం పోలీసులకు తెలిపారు. తెలిసిన సమాచారం ప్రకారం చర్ల గ్రామానికి చెందిన ముక్కాల పూర్ణచందర్‌రావు (45)గా దుమ్ముగూడెం గ్రామానికి చెందిన కొందరు గుర్తించినట్లు సమాచారం. చనిపోయిన వ్యక్తి గత మూడు రోజుల క్రితం చర్ల నుంచి దుమ్ముగూడెం గ్రామంలో ఉన్న బంధువుల వద్దకు వెళ్తున్నట్లు చెప్పి బయలుదేరినట్లు తెలిసింది. దుమ్ముగూడెం బంధువుల ఇంటికి రాకపోవడంతో ఆంధ్రకేసరి నగర్ వద్ద కాలువలో మృతదేహం ఉందని తెలియడంతో మృతదేహాన్ని పరిశీలించగా చనిపోయిన వ్యక్తి తమ బంధువేనని నిర్ధారించుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

కొత్తగూడెం టౌన్, జూన్ 1: రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు హైదరాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో శనివారం ముగిశాయి. తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేసన్ నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా నుంచి 24 మంది పాల్గొన్నారు. మూడు బంగారు పతకాలు, ఒక కాంస్య పతకం సాధించారు. వీరిని జిల్లా యువజన క్రీడల అధికారి పరంధామరెడ్డి, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ మహిధర్, కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తదితరులు అభినందించారు.

## మోటర్ వర్కర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక



యూనియన్ నూతన కార్యవర్గం

దమ్మపేట, జూన్ 1: తెలంగాణ మోటర్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని దమ్మపేటలో ఆదివారం జరిగిన సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షుడిగా ఎస్‌కె.మస్తాన్, ఉపాధ్యక్షుడిగా ఆర్.లోకేష్, కార్యదర్శులుగా ఆర్.నవీన్, వై.మణికంఠ, కోశాధికారిగా ఎన్.పాండు, సలహాదారులుగా ఎస్‌కె.రహీం, కె.శ్రీనివాసాచార్యులు ఎన్నికయ్యారు.

## రిటైర్డ్ తహసీల్దార్‌కు సన్మానం



ముత్తయ్యను సన్మానిస్తున్న లక్కినేని సురేందర్

టేకులపల్లి, జూన్ 1: టేకులపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తు ఉద్యోగ విరమణ పొందిన ముత్తయ్యను బేతంపూడి సొసైటీ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు లక్కినేని సురేందర్‌రావు ఆదివారం సన్మానించారు. ఆయన స్థానంలో ఎల్ వీరభద్రం వస్తున్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ లక్కినేని శ్యామ్‌బాబు, సిబ్బంది కె.వెంకటేశ్వర్లు, సీడీపీవో కేఎం. తార, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.